



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 12 సంచిక : 311 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 13 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :311 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 13 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## విజయవాడలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి

- విజయవాడ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం
- అగ్నికి ఆహుతైన ఏడు ప్రైవేట్ బస్సులు
- మెకానిక్ షెడ్‌లో మొదలైన మంటలు
- ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ఘటనపై కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు

పెన్ పవర్ డెస్క్:నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్ర మాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సులకు మంటలు అంటుకో వడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్ లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా

- మిగతా 2లో





## పవన్ కల్యాణ్ రెండో చేతికీ సమస్య ఉంది

- ముంబై వెళ్లి పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు...
- భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ముంబయి ఆసుపత్రిలో పవన్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు
- పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి
- మూడున్నర గంటల పాటు సాగిన సంక్లిష్టమైన శస్త్రచికిత్స
- సినిమా షూటింగుల్లో అయిన పాత గాయాలతో బాధపడుతున్న పవన్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ముంబై వెళ్లి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు. కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్, ప్రస్తుతం ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొద్దిసేపటి క్రితం ఆసుపత్రికి చేరుకున్న చంద్రబాబు,

- మిగతా 2లో






## విశాఖకు జగన్.. షెడ్యూల్ ఖరారు

- విశాఖకు జగన్.. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించనున్న వైసీపీ అధినేత
- ఈ నెల 14న విశాఖకు వెళ్లనున్న జగన్
- బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు పరామర్శ
- ప్రభుత్వ వైఫల్యంపై తీవ్రస్థాయిలో మండిపడ్డ వైసీపీ నేతలు
- సీఎం, డిప్యూటీ సీఎం మౌనంపై వైసీపీ విమర్శలు
- ప్రమాదం నుంచి బయటపడిన మత్స్యకారుడితోనూ జగన్ భేటీ

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ విశాఖప ట్నంలో పర్యటిం చనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన

- మిగతా 2లో

## వియత్నాం పడవ ప్రమాదం.. సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా

పెన్ పవర్ డెస్క్: వియత్నాం పడవ ప్రమాద బాధితులకు అందుతున్న సహాయకచర్యలపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. వారిని స్వస్థలాలకు తీసుకు వచ్చేందుకు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన గెల్లె కిశోర్ ప్రస్తుతం వియత్నాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు

- మిగతా 2లో





## ఇక సెలవు..

**అధికారిక లాంఛనాలతో ముగిసిన లెజెండరీ సింగర్ జానకి అంత్యక్రియలు**

- మైసూరులో ప్రభుత్వ లాంఛనాలతో ఎస్. జానకి అంత్యక్రియలు
- హెచ్‌డీ కోటె తాలూకాలోని ఫామ్‌హౌస్‌లో ముగిసిన అంతిమ సంస్కారాలు
- మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో పార్థివదేహానికి నివాళులర్పించిన ప్రముఖులు
- వేలాదిగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికిన అభిమానులు

పెన్ పవర్ డెస్క్: సంగీత శిఖరం, లెజెండరీ ప్లే బ్యాక్ సింగర్ ఎస్. జానకి అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ ముగిశాయి. ఆదివారం (జులై 12) సాయంత్రం మైసూరు సమీపంలోని కనియనహుండి దగ్గర కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జానకమ్మ అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. మనువరాలు అప్సర వైద్యుల జానకమ్మ

- మిగతా 2లో

## మరోసారి భగ్గుమన్న పశ్చిమాసియా అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు

**ఇరాన్ ప్రతీకార చర్యలు... అమెరికా స్థావరాలపై భీకర దాడులు, హర్మూజ్ మూసివేత**

- జోర్డాన్, ఖతార్, ఒమన్‌లోని యూఎస్ సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు
- హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ప్రకటన
- తమపై దాడులు పునరావృతమైతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిక

- మిగతా 2లో



## ప్రశ్నించే గొంతులమీద తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్ళకి నా సమాధానం ఇదే

- విమర్శకులపై వీడియో పోస్ట్ చేసిన నటుడు ప్రకాశ్ రాజ్
- 'దిగజారండి' అంటూ వ్యంగ్యంగా స్పందించిన వైనం
- జనసైనికులు, కొన్ని ఛానళ్లను టార్గెట్ చేస్తూ వ్యాఖ్యలు
- అబద్ధాలు, కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ

ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరని స్పష్టం

- మిగతా 2లో



## షాబాద్ ఆరు హత్యల కేసు.. నిందితుడి కోసం 12 బృందాలతో గాలింపు

### నిందితుడి ఆచూకీ తెలిపితే రూ.2 లక్షల బహుమతి

పెన్ పవర్ డెస్క్:రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. గాలింపు బృందాల సంఖ్యను 10 నుంచి 12కు పెంచారు. నిందితుడి కదలికలను గుర్తించేందుకు అతడు ఉపయోగించిన సిమ్ కార్డులతో పాటు బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండొచ్చనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక, ఇతర ప్రాంతాలకు వెళ్లే హైవేలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. 44వ నంబర్ జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటళు ,, దాబాలు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.

- మిగతా 2లో



## సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు.. గుంటూరులో వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్

- వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అరెస్ట్
- గుంటూరులోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు
- సీఎం రేవంత్‌రెడ్డిపై టీవీ డిబేట్‌లో చేసిన వ్యాఖ్యలే కారణమని సమాచారం
- రేవంత్‌ను "జొమాటో డెలివరీ బాయ్" అంటూ తీవ్ర విమర్శలు
- ముందస్తు నోటీసులు లేకుండా అరెస్ట్ చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మళ్లీ దాడులు

హోర్ముజ్ జలసంధిలో కంటైనర్ నౌకపై ఇరాన్ దాడి చేసిన ఘటనతో ఉద్రిక్తత మరోసారి తీవ్రరూపం దాల్చింది. ఆ దాడిలో నౌకకు మంటలు అంటుకోవడంతో సిబ్బంది దాన్ని వదిలి బయటకు రావాల్సి వచ్చింది. దీనికి ప్రతిగా ఆదివారం తెల్లవారుజామున అమెరికా ఇరాన్‌పై భారీ వైమానిక దాడులు చేసింది. అనంతరం ఇరాన్ బహ్రెయిన్, కువైట్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు సమాచారం.

**140 లక్ష్యాలపై అమెరికా దాడులు...**

ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధానికి శాశ్వత ముగింపు దిశగా అమెరికా-ఇరాన్ మధ్య జరిగే చర్చల్లో హోర్ముజ్ జలసంధి ప్రధాన వివాదాంశంగా మారింది. యుద్ధానికి ముందు ప్రపంచంలో వ్యాపారానికి వచ్చే చమురు, సహజవాయువులో దాదాపు ఐదో వంతు ఈ జలసంధి గుండా రవాణా అయ్యేది. యుద్ధ సమయంలో ఈ మార్గంపై ఇరాన్ ఆధిపత్యం వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభం తలెత్తింది. అయితే బ్యారెల్‌కు 120 డాలర్ల వరకు చేరిన చమురు ధరలు ఇప్పుడు గణనీయంగా తగ్గాయి.అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ దాడుల్లో సుమారు 140 లక్ష్యాలను ఛేదించారు. గత రెండు విడతల దాడులతో పోలిస్తే ఇది మరింత విస్తృతంగా సాగింది. క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి నిల్వలు, సమాచార వ్యవస్థలు, ఇతర సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించారు.

**హోర్ముజ్ జలసంధిలో...**

హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై ఇరాన్ దాడి చేసే సామర్థ్యాన్ని ఈ చర్యలు దెబ్బతీస్తాయని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది.ఇరాన్ యుద్ధంపై తాత్కాలిక ఒప్పందం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన కొద్ది రోజులకే ఈ తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సామాజిక మాధ్యమం ద్వారా స్పందిస్తూ, “ఇరాన్ తప్పు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు దాని మూల్యం చెల్లించుకోవాల్సిందే” అని వ్యాఖ్యానించారు.దీనికి ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, ప్రధాన చర్చల ప్రతినిధి మొహమ్మద్ బాఘెర్ ఖలీబఫ్ స్పందించారు.”ఏకపక్ష ఒప్పందాల కాలం ముగిసింది. మాట నిలబెట్టుకోండి, లేకపోతే మూల్యం చెల్లించండి అని ముందే చెప్పాం. ఇప్పుడు వాస్తవం మీ ముందుకొచ్చింది” అని ఆయన ఎక్స్‌లో రాశారు.

**గల్ఫ్ దేశాల్లో అప్రమత్తత...**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ క్షిపణి, డ్రోన్ దాడులపై ప్రజలను అప్రమత్తం చేసింది. అదే సమయంలో సమీపంలోని ఖతర్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. కొద్దిసేపటికే అక్కడ క్షిపణి హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను అడ్డుకున్నామని ఖతర్ సైన్యం వెల్లడించింది. అమెరికా నౌకాదళం ఐదో దళం స్థావరం ఉన్న బహ్రెయిన్‌లో కూడా క్షిపణి హెచ్చరికలు వినిపించాయి. తమ గగనతలంలోకి వచ్చిన క్షిపణులను అడ్డుకుంటున్నామని కువైట్ సైన్యం తెలిపింది. యూఏఈలో ఏ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నారన్నది వెంటనే స్పష్టత రాలేదు. తాజా దాడుల వరకు ఇరాన్ ఎమిరేట్స్‌ను లక్ష్యంగా చేసుకోలేదు. గత మేలో దేశంలోని ఏకైక అణు విద్యుత్ కేంద్రం సమీపంలో డ్రోన్ దాడితో అగ్నిప్రమాదం సంభవించింది.ఇరాన్ ఇతర ప్రాంతాలపై కూడా దాడులు జరిగాయని ప్రకటించినా వాటిపై స్వతంత్ర నిర్ధారణ రాలేదు.

**హోర్ముజ్ జలసంధిలో నౌకపై దాడి...**

హోర్ముజ్ జలసంధిలో సైప్రస్ జెండాతో ప్రయాణిస్తున్న కంటైనర్ నౌకపై ఇరాన్ దాడి చేసింది. ఇంజిన్ గదికి తీవ్ర నష్టం వాటిల్లిందని, ఓ పౌర సిబ్బంది ఆచూకీ తెలియడం లేదని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది.బ్రిటిష్ సైన్యం పర్యవేక్షిస్తున్న యునైటెడ్ కింగ్‌డమ్ మెరిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం ఆ నౌక ఒమాన్ తీరానికి ఆనుకుని ప్రయాణిస్తోంది. ఇరాన్ ప్రాదేశిక జలాల్లోకి వెళ్లకుండా నౌకలు ఈ మార్గాన్నే ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. మంటలు చెలరేగడంతో సిబ్బంది నౌకను వదిలి బయటకు వచ్చారని తెలిపింది.తమ హెచ్చరికలను పట్టించుకోకుండా అనుమతించిన మార్గంలో ప్రయాణించని పలువురు నౌకలను నిలిపివేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. అందులో ఒక నౌకను హెచ్చరిక కాల్పులతో ఆపినట్లు పేర్కొంది.తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హోర్ముజ్ జలసంధి మూసివేస్తామని ఇరాన్ ప్రకటించింది. మరోసారి దాడులు ఎదురైతే ప్రాంతంలోని శత్రు స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది.ఇరాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం బుషెహర్, హోర్మోజ్‌గాన్, ఖుజెస్తాన్, సిస్తాన్-బలూచిస్తాన్ రాష్ట్రాల్లో అమెరికా దాడులు జరిగాయి. నష్టం, మృతుల వివరాలను వెంటనే వెల్లడించలేదు.

**చర్చల తర్వాతే తాజా ఘర్షణలు...**

హోర్ముజ్ జలసంధి అంశంపై ఇరాన్, ఒమాన్ విదేశాంగ మంత్రులు శనివారం సమావేశమయ్యారు. జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడులు, వాటికి అమెరికా ప్రతీకార చర్యల తర్వాత తాత్కాలిక ఒప్పందానికి ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.ఈ జలసంధి ఇరాన్, ఒమాన్ ప్రాదేశిక జలాల్లో ఉన్నప్పటికీ చాలా కాలంగా అంతర్జాతీయ జలమార్గంగా గుర్తింపు పొందింది.హోర్ముజ్ జలసంధి అంశంపై సాంకేతిక, రాజకీయ స్థాయిల్లో చర్చలు కొనసాగించాలని ఇరాన్‌తో అంగీకరించినట్లు ఒమాన్ తెలిపింది. అయితే ఈ జలసంధి అందరికీ అందుబాటులో ఉంటుందన్న విషయంపై ఇరాన్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా మాత్రం అదే కోరుతోంది.

**ప్రతీకారం తప్పదన్న కొత్త సుప్రీం నేత...**

యుద్ధం మొదలైనప్పటి నుంచి బహిరంగంగా కనిపించని ఇరాన్ కొత్త సుప్రీం నేత అయతొల్లా మొజ్తబా ఖమేనీ తన తొలి ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 28న జరిగిన తొలి దాడుల్లో తన తండ్రి అయతొల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తప్పదని పేర్కొన్నారు.”ప్రతీకారం తీర్చుకోవడం మా దేశ సంకల్పం. అది తప్పకుండా అమలు చేస్తాం” అని ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసిన ప్రకటనలో తెలిపారు.

**ఇరాన్‌లో నిర్ణయాలు ఎవరి చేతిలో?**

తాజా దాడులకు ముందే యుద్ధ విరమణను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఇరాన్‌లోని కఠినవాద వర్గం స్వతంత్రంగా వ్యవహరిస్తోందని అమెరికా అధికారులు పేర్లు వెల్లడించకుండా శుక్రవారం తెలిపారు.అయితే కొత్త సుప్రీం నేత నాయకత్వంలో దేశం ఏకతాటిపై ఉందని ఇరాన్ స్పష్టం చేసింది.గురువారం అమెరికా దాడులు ముగిసిన తర్వాత కూడా ఇరాన్‌పై మరికొన్ని దాడులు జరిగాయి. వాటి వెనుక ఎవరున్నారన్నది స్పష్టత రాలేదు.ఆ దాడుల బాధ్యతను ఇజ్రాయెల్ ప్రకటించలేదు. ఇరాన్ మళ్లీ తమపై దాడులు చేయకుండా అడ్డుకునేందుకు గల్ఫ్ అరబ్ దేశాలే ఈ చర్యలకు పాల్పడి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గురువారం అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతర్‌లపై దాడులు చేసింది.

# పశ్చిమ బెంగాల్‌కు ఉజ్వల భవిష్యత్తు.. సీఎం చంద్రబాబు నాయుడు ధీమా!

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థవంతమైన నాయకత్వంలో భారతదేశం అంతర్జాతీయంగా అపారమైన గౌరవాన్ని సంపాదించుకుందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. ముంబై పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆర్థిక మందగమనాన్ని, సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, భారతదేశం మాత్రం అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ నాయకత్వం వల్లే ఇది సాధ్యమవుతోందని హర్షం వ్యక్తం చేసిన ఆయన.. 2047 నాటికి భారతదేశం ఖచ్చితంగా పూర్తి స్థాయిలో ‘అభివృద్ధి చెందిన దేశం’ (ఱవఙవశ్రీశీజూవఠ చీగ్‌ఱశీఅ) గా అవతరిస్తుందనే పూర్తి నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు.ఇదే సమయంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అమలు కాబోతున్న యూనిఫాం సివిల్ కోడ్ (ఖజజ) పరిణామాలపై చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా మూసుకుపోయిన పశ్చిమ బెంగాల్ అభివృద్ధి తలుపులు ఇప్పుడు తెరుచుకున్నాయని (ఖఅశ్రీశిఏవఠ) ఆయన వ్యాఖ్యానించారు. “గతంలో ‘బెంగాల్ ఈ రోజు ఆలోచించేది.. దేశం రేపు ఆలోచిస్తుంది’ అనే ఒక సామెత ఉండేదని, కానీ ఈ మధ్య కాలంలో బెంగాల్ ఆలోచించడం మానేసిందని.. అయితే ఇప్పుడు మళ్లీ ఆలోచించడం మొదలుపెట్టిందని” పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అపారమైన మానవ వనరులు, అవకాశాలు ఉన్నాయని.. రాబోయే రోజుల్లో ఆ రాష్ట్ర భవిష్యత్తు అత్యంత ఉజ్వలంగా, ప్రకాశవంతంగా మారబోతోందని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# ప్రశ్నించే గొంతులమీద తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్ళకి నా సమాధానం ఇదే

ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తనపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై తీవ్రస్థాయిలో, వ్యంగ్యంగా స్పందించారు. ‘దిగజారండి’ అంటూ విమర్శకులను ఉద్దేశించి ఓ వీడియో పోస్ట్ చేశారు. తాను మౌనంగా లేనని, అన్నీ గమనిస్తున్నానని చెబుతూ ‘ఎక్స్’ వేదికగా ట్వీట్ చేశారు.“నేను మౌనంగా లేను. అన్నీ చూస్తున్నా. ఎమ్మెల్యేలు, ఎంపీలు, వాళ్ల పలుకుబడితో జనసైనికులు, కొందరికి అమ్ముడుపోయిన చానళ్లు, యూట్యూబర్లు... సోషల్ మీడియాలో మీ అబద్ధాలు, మీరు అల్లుతున్న కట్టుకథలు, మీ బూతులు అన్నీ వింటున్నా. మీ అందరికీ నా సమాధానం ఒక్కటే.. దిగజారండి... దిగజారండి... దిగజారుతూనే ఉండండి. ఇది మీ దిగజారుడుతనానికి ఆరంభం మాత్రమే. మొత్తం ప్రపంచం మీ దిగజారుడుతనాన్ని చూస్తోంది. అయితే, దిగజారడం అనే సామర్థ్యంపై మీకున్న నమ్మకాన్ని మాత్రం దిగజారనివ్వకండి. కాస్త గట్టిగా దిగజారండి...

అరుస్తూ దిగజారండి... నాలుగు వైపుల నుంచి దిగజారండి... సిగ్గులేకుండా దిగజారండి. దిగజారడంలో మీకు మీరే సాటి అనే గర్వంతో దిగజారండి. ఎంత చేసినా ప్రశ్నించే గొంతుకలను మాత్రం ఆపలేరు. మీ పని మీరు కానివ్వండి... దిగజారుతూనే ఉండండి.. జస్ట్ ఆస్కింగ్..” అంటూ తన వీడియోను ముగించారు. ప్రకాశ్ రాజ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# మరోసారి భగ్గుమన్న పశ్చిమాసియా అమెరికా, ఇరాన్ పరస్పర దాడులు

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ దేశ దక్షిణ ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్, ఖతార్, ఒమన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతటితో ఆగకుండా హర్మూజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది.తమ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ ద్వారా ఐఆర్జీసీ ఈ వివరాలు వెల్లడించింది. తమ దక్షిణ తీరప్రాంతాల్లోని పలు సైనిక స్థావరాలు, కమ్యూనికేషన్ టవర్లపై యూఎస్ వైమానిక దాడులు చేసిందని పేర్కొంది. దీనికి ప్రతీకారంగా మూడు దశల్లో దాడులు చేశామని తెలిపింది. మొదటి దశలో జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని, అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ల హ్యాంగర్‌ను ధ్వంసం చేశామని వివరించింది.

రెండో దశలో ఖతార్‌లోని అల్ ఉదెయిద్ ఎయిర్‌బేస్‌పై దాడి చేసి, కమాండ్ సెంటర్‌తో పాటు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ కేంద్రాలను ధ్వంసం చేశామని పేర్కొంది. మూడో దశలో ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో ఉన్న అమెరికా లాజిస్టికల్ కేంద్రాలపై భారీ దాడి చేశామని తెలిపింది. ఇరాన్ సైన్యం కూడా కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై కమికాజే డ్రోన్లతో దాడులు చేసిందని, రాడార్ సైట్లు, ఆయుధ డిపోలను ధ్వంసం చేసిందని వెల్లడించింది. అమెరికా మళ్లీ దాడులకు పాల్పడితే మరింత తీవ్రమైన ప్రతిచర్యలు ఉంటాయని ఐఆర్జీసీ హెచ్చరించింది. అమెరికా జోక్యం ఆగే వరకు హర్మూజ్ జలసంధి మీదుగా ఏ నౌకనూ అనుమతించబోమని స్పష్టం చేసింది.

# సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు.. గుంటూరులో వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే, సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నాగార్జున యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న తెలంగాణ పోలీసులు ఆదివారం గుంటూరుకు చేరుకున్నారు. నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.అనంతరం, తమ వివరాలను, అరెస్ట్ సమాచారాన్ని స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తామని చెప్పి ఆయన్ను తమతో తీసుకెళ్లారు. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ నేతను, మరో రాష్ట్ర పోలీసులు వచ్చి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది..

ఇటీవల ఒక టీవీ ఛానల్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డిని ‘జొమాటో డెలివరీ బాయ్’ అని సంబోధిస్తూ, ఆయన జీవోలను కూడా సరిగా చదవరని ఆరోపించారు.

ఎమ్మెల్యేగా కూడా రేవంత్ సమర్థంగా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల కారణంగానే ఆయనపై కేసు నమోదై, అరెస్ట్ జరిగినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని తెలంగాణ కాంగ్రెస్ కూడా నిర్ధారించింది.

# పవన్ కల్యాణ్ రెండో చేతికీ సమస్య ఉంది

- మొదటి పేజి తరువాయి

పవన్ కల్యాణ్‌తో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నారాయణ కూడా పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ చాలాకాలంగా భుజం నొప్పితో ఇబ్బంది పడుతున్నారు. సినిమా షూటింగుల సమయంలో అయిన పాత గాయాలు ఇప్పుడు తీవ్రం కావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవలి ఎన్నికల ప్రచార సమయంలో కూడా తీవ్రమైన నొప్పిని భరిస్తూనే ఆయన కూటమి తరఫున ప్రచారం నిర్వహించారు.ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో వైద్యుల బృందం పవన్ కల్యాణ్‌కు సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. ఇటీవలే సైనస్ సమస్యకు కూడా ఆయన ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. తాజాగా భుజం శస్త్రచికిత్స అనంతరం పవన్ కల్యాణ్ కోలుకుంటున్నారు.

# వియత్నాం పడవ ప్రమాదం.. సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు ఆరా

- మొదటి పేజి తరువాయి

అధికారులు తెలిపారు. ఆయన ఆరోగ్యం క్రమంగా కుదుటపడుతోందని వివరించారు. మరోవైపు మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ఒక ఏజెన్సీని నియమించినట్టు అధికారులు వెల్లడించారు. భౌతికకాయాల అప్పగింత, తరలింపు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన పర్యాటకులను ఇవాళ విమానాల ద్వారా తమ స్వస్థలాలకు తరలించేలా ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. బాధిత వ్యక్తులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చే వరకు,

మృతుల భౌతిక కాయాల తరలింపు ప్రక్రియ పూర్తిగా ముగిసే వరకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలని ఏపీ భవన్ అధికారులను సీఎం ఆదేశించారు. ఈ తరలింపు ప్రక్రియపై అక్కడి భారత ఎంబసీతో సమన్వయం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు.

# విజయవాడలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అగ్నికి ఆహుతి

- మొదటి పేజి తరువాయి

మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

## విశాఖకు జగన్.. షెడ్యూల్ ఖరారు

- మొదటి పేజి తరువాయి

జగన్ పర్యటన ఖరారైంది.ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు.ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు.గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు.

జూలై 4న గంగవరం తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో ఏడుగురు మత్స్యకారులతో వెళ్లిన మర పడవ బోల్తా పడిన విషయం తెలిసిందే. వీరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా, ఆరుగురి ఆచూకీ లభించలేదు. నాలుగు రోజుల పాటు నేవీ, కోస్ట్ గార్డ్ గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఆపరేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం గల్లంతైన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

## ఇక సెలవు..

- మొదటి పేజి తరువాయి

చితికి నిప్పంటించారు. తన మధురమైన స్వరంతో భారత సినీ సంగీత ప్రపంచాన్ని దశాబ్దాల పాటు ఓలలాడించిన గానకోకిలను కడసారి చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. భౌతికంగా జానకమ్మ మన నుంచి దూరమైనా.. పాటల రూపంలో ఆమె మనతో ఉంటారని స్మరించుకున్నారు. అంతకముందు జానకమ్మ భౌతికకాయాన్ని అభిమానుల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్?లో ఉంచగా సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు హాజరై నివాళులర్పించారు.

**గాన కోకిల కన్నుమూత:**

సినీ సంగీత పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. లెజెండరీ సింగర్, గానకోకిల ఎస్. జానకి గొంతు మూగబోయింది. గతకొంత కాలంగా వయోభారం, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధ పడుతోన్న ఆమె మైసూర్?లోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం (జులై 11) కన్నుమూశారు.జానకి మనువరాలు అప్సర వైద్యుల ఇన్స్టాగ్రామ్ వేదికగా ఈ విషయాన్ని ధృవీకరించారు. దీంతో భారతీయ సంగీత ప్రపంచంలో ఒక శకం ముగిసింది. తన అద్భుతమైన స్వరంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న గాన కోకిల జానకి మరణంపై పలువురు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు.

ఎస్. జానకి బ్యాగ్రౌండ్:తన మధురమైన గాత్రంతో ఆరు దశాబ్దాల పాటు కోట్ల మంది శ్రోతలను మైమరపించిన గానకోకిల, దక్షిణ భారత నైటింగేల్ ఎస్. జానకి 1938, ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్లోని గుంటూరు జిల్లా పల్లపట్లలో జన్మించారు. ఏ విధమైన శాస్త్రీయ సంగీతం నేర్చుకోకుండానే తన అద్భుత స్వరంతో ఆరు దశాబ్దాల పాటు సంగీత పరిశ్రమను ఏలారు. 1957లో తమిళ చిత్రం ద్వారా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె.. తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీతో పాటు దాదాపు 17 భాషల్లో 48 వేలకు పైగా పాటలు పాడి సరికొత్త రికార్డు సృష్టించారు.

తన అద్భుతమైన స్వరంతో 4 జాతీయ అవార్డులు, 32 వేర్వేరు రాష్ట్ర ప్రభుత్వాల అవార్డులు సాధించారు. చిన్న పిల్లల గొంతు నుంచి పండు ముసలి వారి వరకు.. ఎలాంటి పాత్రకైనా తన గొంతుతో ప్రాణం పోయడం ఆమె స్పెషాలిటీ. జానకి భౌతికంగా మన మధ్య లేకపోయినా... ఆమె పాడిన వేలాది పాటలు, ఆ మధుర స్వరం సంగీత ప్రియుల గుండెల్లో ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

## షాబాద్ ఆరు హత్యల కేసు.. నిందితుడి కోసం 12 బృందాలతో గాలింపు

- మొదటి పేజి తరువాయి

తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో తొలుత బాలిక తల్లి, నానమ్మలను రాజ్‌కుమార్ కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. ఈ ఆరు హత్యలు గంటల్లోనే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. పరారీలో ఉన్న నిందితుడిని పట్టిస్తే.. రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు ఇప్పటికే ప్రకటించారు. ఈ ఘటన అనంతరం పోలీసు ఉన్నతాధికారులు షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేశారు.

# 14న గ్రామ వాలంటీర్ల మహాగర్జను జయప్రదం చేయండి



- కూటమి అధికారంలోకి వస్తె 10 వేల రూపాయలు ఇస్తామని మోసం.
- 2.60 లక్షల కుటుంబాలకు రోడ్డున పడేశారు.
- గ్రామ, వార్డు సచివాలయాల వాలంటీర్ల యూనియన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వంపూరు గిద్యోన్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 12.** ఈనెల 14న అరకు నియోజకవర్గ కేంద్రంలో గ్రామ వార్డు సచివాలయాల వాలంటీర్ల మహాగర్జనను జయప్రదం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వాలంటీర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి వంపూరు గిద్యోన్ పిలుపునిచ్చారు. ఆదివారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గ్రామ సచివాలయాల వాలంటీర్ల యూనియన్ మండల అధ్యక్షుడు గొల్లోరి దేవా అధ్యక్షతన వాలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి గిద్యోన్ మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గ్రామ వార్డు సచివాలయాల వాలంటీర్లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 5వేలు కాదు 10వేల రూపాయలు వేతనాలు ఇస్తామని హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాలంటీర్లను మోసం చేసిందనీ ప్రభుత్వాన్ని విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరదీసే ఉద్దేశంతో 2019 సంవత్సరంలో గ్రామ, వార్డు సచివాలయాల వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేశారని, అయితే ఎన్నికల సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారాలలో ఎక్కడికి వెళ్లినా గ్రామ వార్డు సచివాలయాల వాలంటీర్లకు 5వేల రూపాయలు సరిపోవని, తాము అధికారంలోకి వస్తే పదివేల రూపాయలు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయిన కనీసం వాలంటీర్ల కొరకు పట్టించుకోకుండా పక్కన పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వాలంటీర్లకు జీఓ లేవని నెపంతో విస్మరించడం సరికాదు అన్నారు. దీనివల్ల 2.60 లక్షల మంది కుటుంబాలు రోడ్డున పడ్డామన్నారు. ఎన్నికల హామీలు తక్షణమే అమలు చేసి వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14న వాలంటీర్ల మహాగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండల గ్రామ సచివాలయాల వాలంటీర్ల యూనియన్ నాయకులు కే భాను ప్రసాద్, టీ. కిరణ్, కే గుప్తా, ఎస్ నర్సింగ్, మధు తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# 1/70 చట్టం, బాక్సైట్ జోలికి వస్తే తరిమికొడతాం




ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు హెచ్చరిక

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 12:** జీకే వీధి మండలంలోని గాలికొండ, ఈదారకొండ పంచాయతీల గిరిజనులు ఆదివారం సమావేశమై 1/70 చట్టం పరిరక్షణ, బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక ఉద్యమంపై చర్చించారు. ఈ సందర్భంగా గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ, 1/70 చట్టానికి వ్యతిరేకంగా గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బాక్సైట్ తవ్వకాల కోసం ప్రభుత్వాలు రహస్యంగా చేపడుతున్న సర్వేలపై గిరిజనులకు సమాధానం చెప్పాలని కోరారు. గిరిజనుల భూములు, హక్కులను పరిరక్షించే 1/70 చట్టం గిరిజనులకు గుండెకాయ లాంటిదని ఆయన అన్నారు. అదే విధంగా బాక్సైట్ తవ్వకాలకు మార్గం సుగమం చేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని, ఈ రెండింటి వల్ల గిరిజనుల అస్తిత్వానికే ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కులను కాపాడుకోవడానికి పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గిరిజనుల హక్కులకు వ్యతిరేకంగా వ్యవహరించే ఏ రాజకీయ పార్టీలో ఉన్నా, ఆ పార్టీకి రాజీనామా చేసి ఉద్యమంలో భాగస్వాములు కావాలని సూచించారు. భవిష్యత్తులో నిర్వహించే ఉద్యమాలు, పోరాటాల్లో గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు గెమ్మెలి చంద్రరావు, పలాసి హిర్మియ, వెంకట్, పి. బాలు, పీసా కమిటీ సభ్యులు వంతల సుబ్బారావు, మోహన్, పి. రామారావు, చిట్టిబాబుతో పాటు గాలికొండ, ఈదారకొండ పంచాయతీలకు చెందిన గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏబులం సచివాలయంలో మౌలిక వసతుల కొరత









- ఏడాది గడిచినా తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయని అధికారులు
- తాగునీటి సదుపాయం లేక సిబ్బంది, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 12:** ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన ఏబులం గ్రామ సచివాలయం ప్రారంభమై ఏడాది గడిచినా ఇప్పటికీ కనీస మౌలిక వసతులు లేక సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనానికి తలుపులు, కిటికీలు అమర్చకపోవడంతో పాటు తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణం పూర్తిగా పూర్తికాకముందే ప్రారంభోత్సవం నిర్వహించడం వల్ల ప్రస్తుతం అనేక సమస్యలు తలెత్తాయని గ్రామస్థులు చెబుతున్నారు. కార్యాలయానికి తలుపులు, కిటికీలు లేకపోవడంతో ప్రభుత్వ రికార్డులు, కార్యాలయ సామగ్రి భద్రత ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండ, వాన, గాలి, ధూళి నేరుగా కార్యాలయంలోకి చేరుతుండటంతో ఉద్యోగులు ఇబ్బందికర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే అవకాశం ఉందని కూడా స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విధులకు వచ్చే సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు బయట నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. టాయిలెట్లకు కూడా నీటి వసతి లేక మహిళా ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

**ప్రారంభోత్సవాలకే పరిమితమా?**

కనీస సౌకర్యాలు కల్పించకుండానే సచివాలయాన్ని ప్రారంభించడంపై గ్రామస్థులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రజాధనంతో నిర్మించిన భవనాన్ని అసంపూర్తిగా వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏబులం గ్రామ సచివాలయంలో తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సదుపాయం, ఇతర మౌలిక వసతులను వెంటనే కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# 'సర్'ప్రక్రియకు రెండు రోజుల వ్యవధి




13 వ వార్డులో"సర్" పై అవగాహన శిబిరం

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 12:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో రాజేష్ 2002 ఓటర్ లిస్ట్ ప్రామాణికంగా సర్ ప్రతి వార్డులో ప్రతి బూత్ బిఎల్ ఓ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులు బి ఎల్ ఏ సమక్షంలో ప్రతి ఓటర్ కు ఎన్యుమరేషన్ ఫామ్స్ అందించి వాటిని 2002 ఓటర్ లిస్ట్ ద్వారా మ్యాపింగ్ చేసి డిజిటలైజేషన్ చేసే క్రమంలో కొంతమందికి అవగాహన లోపం వల్ల ఓటర్ ఫామ్స్ వెనక్కి ఇవ్వకపోవడంతో ఎన్నికల సంఘం ఇచ్చిన గడువు మరో రెండు రోజులే మాత్రమే ఉండడంతో శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు.ఆదేశాలు మేరకు 13వ వార్డు టిడిపి కార్యాలయం నందు వార్డు అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు ఆధ్వర్యంలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు సర్ పై సందేహాలను నివృత్తి చేసి సంబంధిత బి ఎల్ ఓ ల ఫోన్ నెంబర్లు అందించి వారితో మాట్లాడించి వారి దగ్గరికి పంపించడం జరిగిందనీ, ప్రతి ఒక్కరికి ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటును కాపాడుకోవడంలో ప్రజలు ఎంతో బాధ్యత వహించాలని, అధికారులు మీ దగ్గరికి వచ్చినప్పుడు వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి మీ ఓటును జాగ్రత్త పరుచుకోవాలని,

ఓటు కావాలంటే అధికారులు చుట్టూ మీరు తిరగాల్సి వస్తుందని, సమాజంలో ప్రతి ఒక్కరికి ఓటర్ గుర్తింపు అత్యంత కీలకమని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటును కాపాడుకోవాలని అధ్యక్షులు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ, వార్డు ప్రధాన కార్యదర్శి బాలస్వామి,మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా, బి సి సెల్ అధ్యక్షులు రుత్తల వెంకట్రావు,మహిళా ప్రధాన కార్యదర్శి కర్రి మణి, మహిళా ఉపాధ్యక్షురాలు మచ్చ జ్యోతమ్మ,ఓశెట్టి గురుమూర్తి గణపతి, ఓశెట్టి పైడ్రాజు, నెల్లి అప్పారావు,కనకల శ్రీను,,షేక్ పీరుబాబు,శ్రీదేవి,కనకదుర్గ,పఊహ,బోనెల కుమారి తదితరులు పాల్గొన్నారు.

# వివాదం లో అనంతగిరి ఘాట్ రోడ్డు ఐటిడిఏ టోల్ ప్లాజా






- టూరిస్టులకే పన్ను.. గిరిజనులకు ఫ్రీ అని మాట మార్చిన అధికారులు!
- కలెక్టర్ మౌనం పై ఆదివాసుల మండిపాటు

**అనంతగిరి/అరకులోయ పెన్ పవర్ జూన్12:** పర్యటకుల నుంచి టోల్ వసూలు చేస్తాం.. స్థానిక గిరిజన వాహనాలు రూపాయి తీసుకోకుండా వదిలేస్తాం.. అన్ని నమ్మబలికిన అధికారులు ఇప్పుడు మాట మార్చారు. అనంతగిరి మండలంలోని కాశీపట్నం వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా వద్ద ప్రస్తుతం స్థానిక గిరిజన వాహనాల నుంచి కూడా బలవంతపు వసులకు దిగుతున్నాంతో స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. అధికారులు ముందు ఒక మాట తర్వాత ఒక మాట వైఖరి పై గిరిజన సంఘాలు ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాడు హామీలు నేడు నిలువు దోపిడీ అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్యటక ప్రాంతం అభివృద్ధి ప్లాస్టిక్ నియంత్రణ పేరుతో జిల్లా యంత్రాంగం ఈ ఘాట్ రోడ్ టోల్ గేట్ ను ఏర్పాటు చేసిన సమయంలో స్థానికులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చే టూరిస్ట్ వాహనాలకు మాత్రమే పన్ను వర్తిస్తుందని స్థానిక గిరిజనుల జీపులు, ఇతర వాహరాలకు ప్రత్యేకంగా ఉచిత పాసులు ఇచ్చి వదిలేస్తామని చెప్పారు. కానీ ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది టోల్ సిబ్బంది గిరిజన నెంబర్ ప్లేట్లను సైతం లెక్కచేయకుండా నిత్యవసరాలు తరలించే గిరిజన వాహనాలకు అడ్డుకుంటూ పన్ను కట్టాల్సిందేనని కూర్చుంటున్నారు. ఫీజు కట్టనిదే వాహనాలకు వదిలేది లేదని



మొండిస్తుండటంతో ఆదివాసీలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. ఈ గిరిజన వ్యతిరేక వసులపై అల్లూరి జిల్లా కలెక్టర్ కు పలుమార్లు ఫిర్యాదులు అందినప్పటికీ జిల్లా కలెక్టర్ ఇప్పటివరకు దీనిపై ఎలాంటి స్పందన తెలియజేయకపోవడంపై గిరిజన (జె ఏ సి )తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో ఇంత రగడ జరుగుతున్న అధికారులు ఇచ్చిన మాట తప్పి గిరిజనలను ఇబ్బంది పాడుతున్న జిల్లా ఉన్నతాధికారులు మౌనం వహించడం వెనక ఉన్న అంతర్యమేమిటని స్థానిక నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని టోల్ ప్లాజా వద్ద గిరిజనులకు ఇచ్చిన ఉచిత మినహాయింపు హామీని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## సైబర్ నేరాలు మహిళల భద్రత పట్లఅప్రమత్తంగా ఉండాలి

**కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్ వర్మ**



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 12:** సైబర్ నేరాలు, మహిళల భద్రత పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్ వర్మ పిలుపునిచ్చారు. ఆదివారం కొయ్యూరులో జరిగే వారపు సంతకు మారుమూల, చుట్టుపక్కల ప్రాంతాల నుండి తరలివచ్చే గిరిజనులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ... లోను యాప్స్ పేరుతో అనేక మోసాలు జరుగుతున్నాయని, పార్ట్ టైం ఉద్యోగాలు, కేవైసీ అప్డేట్, కస్టమర్ కేర్, పెట్టుబడులు డిజిటల్ అరెస్టు, క్యూఆర్ కోడ్ స్కాముల వంటి వివిధ రకాల సైబర్ నేరాలు గురించి తెలిపారు. ఇతరులు ఎవరైనా బ్యాంకు ఖాతా వివరాలు ఏటీఎం పిన్, ఓటిపి, పాస్వర్డ్ వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని అన్నారు, అనుమానస్పద కాల్స్ లేదా లింకులు విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ప్రాణ రక్షణ కోసం అని వాహనదారులు మాత్రమే కాకుండా వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు, అతివేగం నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదానికి దారితీస్తాయన్నారు.. మహిళలు బాలికలపై జరిగే నేరాలను అరికట్టడంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ అక్రమ రవాణా లేదా విషయాలపై సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు

## చవటపాడు వాల్మీకి వీధి వాసులకు తీరనున్న తాగునీటి కష్టాలు.

**జల్ జీవన్ మిషన్' కింద బోరు మంజూరు.**

**ఉత్సాహంగా పనుల ప్రారంభం.**

**ప్రభుత్వానికి స్థానికుల కృతజ్ఞతలు.**



**చింతపల్లి పెన్ పవర్ జూలై 12.** ఏళ్లుగా ఆ గ్రామస్థులు పడుతున్న నీటి కష్టాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల మేర నడిచి, బురద దారుల్లో ఇబ్బందులు పడిన వాల్మీకి వీధి వాసుల దాహార్తి తీరనుంది. కూటమి ప్రభుత్వం, ఐటీడీఏ అధికారుల చొరవతో జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి బోరు మంజూరు కావడంతో ఆదివారం పనులకు స్థానికులు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా శంకుస్థాపన చేశారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని చవటపాడు వాల్మీకి వీధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. గుక్కెడు నీటి కోసం మహిళలు కిలోమీటర్ల మేర నడిచి వాగుల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. బురదమయమైన దారుల్లో బిందెలు మోస్తూ పడుతూ లేస్తూ నానా అవస్థలు పడేవారు. రోజంతా నీటి కోసమే సమయం కేటాయించడంతో పనులకు వెళ్లలేక ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం సచివాలయం, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నో వినతిపత్రాలు అందజేశారు. గ్రామస్థుల అభ్యర్థనలపై స్పందించిన కూటమి ప్రభుత్వం, ఐటీడీఏ, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల చొరవతో 'జల్ జీవన్ మిషన్' నిధులతో వాల్మీకి వీధికి తాగునీటి బోరు మంజూరైంది. దీంతో ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి గ్రామస్థులు బోరు పనులకు భూమిపూజ చేసి, పనులను లాంఛనంగా ప్రారంభించారు. బోరు మంజూరుపై వాల్మీకి వీధి మహిళలు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. తమ కష్టాలను గుర్తించి నీటి సదుపాయం కల్పించిన కూటమి ప్రభుత్వానికి, ఐటీడీఏ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులకు, సిబ్బందికి, సహకరించిన ప్రజాప్రతినిధులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో వైసీపీ, కూటమి నేతలు సింహాచలం, మోహన్ శెట్టి, సింగరపు రాంబాబు, బూర్జ కేశవరావు, సమిరెడ్డి దాసుబాబు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీరు కారణంగా కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్న పాతపాడి గ్రామం

- పాతపాడి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు
- ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్




**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 12 :** సికిల్ సెల్ డయాలసిస్ సమస్యలతో బాధపడుతున్న పాతపాడి గ్రామస్తులకు రక్షిత త్రాగునీరు అందించే చర్యల్లో భాగంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ తెలిపారు. త్రాగునీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో రక్షిత త్రాగునీరు అందించే చర్యలకు ధార్మిక సేవా ట్రస్టు ప్రతినిధులు శ్రీకారం చుట్టినట్లు ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొండగోకిరి పంచాయతీ పాతపాడి గ్రామంలో కలుషిత త్రాగునీరు వల్ల గ్రామస్తులు సికిల్ సెల్, కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతుండగా వ్యాధులకు కారణమవుతున్న గ్రామంలోని ఒక బోరు మూసి వేయడం జరిగిందని దీంతో గ్రామస్తులు త్రాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో ఈ గ్రామస్తులకు రక్షిత త్రాగునీరు అందించేందుకు ధార్మిక సేవా ట్రస్టు సంస్థ ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మారుమూల ఆదివాసి గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ధార్మిక సేవా ట్రస్టు ప్రతినిధులు సేవా భావంతో చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మారుమూల గ్రామాల్లో త్రాగునీటి ఇబ్బందులను ట్రస్ట్ ప్రతినిధులకు తెలియజేయడంతో కొయ్యూరు మండలంలో మినరల్ వాటర్ ప్లాంట్ ల ఏర్పాటుకు సుముఖత చూపించినట్లుగా ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా త్రాగునీటి సమస్య నివారించాలని, కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న తమకు మినరల్ వాటర్ అందించాలని కోరుతున్న పాతపాడి గ్రామాన్ని బిజెపి అల్లూరి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జుర్రా గౌరీ పార్వతి, బిజెపి నేత అరిమెల రాజు లతో కలిసి సందర్శించడం జరిగిందన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేయడం జరిగిందని త్వరలోనే సంస్థ ప్రతినిధులను గ్రామానికి తీసుకువచ్చి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## నరవలో పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటుకు వినతి

- పోలీస్ కమిషనర్ కి వినతిపత్రం అందజేసిన స్థానిక నాయకులు
- 24 గంటల పోలీసు సేవలు అందేలా చర్యలు
- జనసేన పార్టీ అధ్యక్షుడు వబ్బిన జనార్ధన శ్రీకాంత్ కు కమిషనర్ హామీ



**పెందుర్తి, పెన్ పవర్, జూలై 12 :** గ్రేటర్ విశాఖ నగరంలోని 88వ వార్డు నరవ గ్రామాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్ శంఖబ్రత్ బాగ్చీను 88వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు వబ్బిన జనార్ధన శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరవలో ప్రస్తుతం పోలీస్ కంట్రోల్ ఆఫీస్‌గా కొనసాగుతున్న కేంద్రాన్ని పూర్తి స్థాయి పోలీస్ చెక్‌పోస్ట్‌గా మార్చి 24 గంటల పాటు పోలీసు సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం కంట్రోల్ ఆఫీస్ మాత్రమే ఉండడంతో నిరంతరం పోలీసులు అందుబాటులో లేకపోవడం వల్ల నరవతో పాటు పరిసర 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీస్ స్టేషన్ సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పోలీసు సేవలు సకాలంలో అందడం లేదని, ప్రజల భద్రత దృష్ట్యా నరవలో శాశ్వత పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు అత్యవసరమని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిని సానుకూలంగా స్వీకరించిన పోలీస్ కమిషనర్ శంఖబ్రత్ బాగ్చీ మాట్లాడుతూ, నరవలోని పోలీస్ కంట్రోల్ ఆఫీస్‌కు అదనపు పోలీసు బలగాలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని, దానిని పోలీస్ చెక్‌పోస్ట్‌గా అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 88వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంతకోరు శివకుమార్, నరవ మాజీ సైనికుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు గళ్ళ దేముడు, అధ్యక్షుడు మిద్దు సూర్యనారాయణ, కార్యదర్శి గవర పైడిరాజు, మాజీ సైనికులు, జనసేన పార్టీ నాయకులు లింగం వాసు, గవర అప్పలరాజు, గవర శ్రీనుతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా నరవలో పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలనే విజ్ఞప్తి పోలీస్ కమిషనర్‌కు చేరడం పట్ల గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మందుబాబులకు భారీ మోత.

- 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా.
- బహిరంగంగా మద్యం తాగిన మరో 30 మందికి ఫైన్.




**చింతపల్లి పెన్ పవర్ జూలై 12.** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై న్యాయస్థానం కొరడా ఝుళిపించింది. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో నిబంధనలు ఉల్లంఘించిన మందుబాబులకు భారీ జరిమానాలు విధించారు. ఈ మేరకు చింతపల్లి ఎస్సై జి. వీరబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ?ఇటీవల పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 11 మంది పట్టుబడ్డారు. వీరందరినీ శనివారం లోక్ అదాలత్‌లో జ్యుడిషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున భారీ జరిమానా విధించారు. అలాగే, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిన మరో 30 మందికి కూడా లోక్ అదాలత్‌లో జరిమానా విధించినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరబాబు మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం తమతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఇకముందు కూడా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లకై 14న మహా ధర్నా.



**విజయవంతం చేయాలని నాయకుల విజ్ఞప్తి.**

**చింతపల్లి పెన్ పవర్ జూలై 12.** ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 14న పాడేరు కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో చేపట్టనున్న పికెటింగ్, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఫ్యాప్టో చింతపల్లి డివిజన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ.. 12వ పీఆర్సీని తక్షణమే ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహించే ప్రత్యేక టెట్‌లో అందరికీ ఒకే విధమైన ఉత్తీర్ణత మార్కులు ఉండేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అలాగే, కారుణ్య నియామకాలను వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద పూర్తి చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి మినహాయించి బదిలీల్లో ఆగిపోయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. గతంలో విజయవాడలో నిర్వహించిన ధర్నా, రిలే నిరాహార దీక్షలకు ప్రభుత్వం స్పందించకపోవడంతోనే ఈ మలిదశ పోరాటానికి సిద్ధమయ్యామని వారు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమ సన్నాహక సమావేశంలో ఫ్యాప్టో చింతపల్లి డివిజన్ నాయకులు భౌడు గంగరాజు, దేపూరి శశికుమార్, శెట్టి రామకృష్ణ, రెడ్డి వెంకటేశ్వర్లు, కాకరి చంద్రావు, కిట్లంగి పెద్దబ్బాయి, మొల్ల దేముడు, కంకిపాటి గణపతి రావు, లకే నగేష్ కుమార్, కోరాపు చలపతిరావు, భౌడు శ్రీనివాస వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బోర్ పనుల వివాదం.. వైఎస్సార్సీపీ వైఖరిని ఖండించిన కూటమి నేతలు

**సంకాడలో బోర్ పనులకు అడ్డంకులపై కూటమి నేతల ఆరోపణ**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 10:** సంకాడ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన బోర్‌వెల్ తవ్వకాలను వైఎస్సార్సీపీ నాయకులు అడ్డుకున్నారని కూటమి నాయకులు ఆరోపించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై గ్రామ పెద్దలు, కూటమి నాయకులు సమావేశమై చర్చించి, అధికారులు శుక్రవారం బోర్‌వెల్ తవ్వకానికి ముహూర్తం నిర్ణయించినట్లు తెలిపారు. అయితే వైఎస్సార్సీపీ ఎంపీపీ హాజరుకాలేదనే కారణంతో వైస్ ఎంపీపీ లోత దేముడు బోర్‌వెల్ పనులను నిలిపివేశారని ఆరోపిస్తూ ఈ చర్యను ఖండించారు. తాగునీరు అందించడం రాజకీయాలకు అతీతమైన అంశమని, అభివృద్ధి పనులకు ఆటంకం కల్పించడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలను మరింత కష్టాల్లోకి నెట్టే విధంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఈ సందర్భంగా జనసేన పంచాయతీ అధ్యక్షుడు ఊలం ఈశ్వరరావు, టీడీపీ మాజీ ఎంపీటీసీ మొట్టడం లక్ష్మణరావు, మొట్టడం రాజారావు, డొంబురి చిట్టిబాబు, లోచల భీమరాజ్, కోర గురుమూర్తి, మొట్టడం సూర్యారావు, డొంబురి గిరిబాబు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. సంకాడ గ్రామంలో బోర్‌వెల్ పనులను వెంటనే ప్రారంభించి, శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## అయినాడలో ఎస్ఐఆర్ పనులను తనిఖీ చేసిన తహసీల్దార్ దాడిశెట్టి శైలజ



**పద్మనాభం , పెన్ పవర్:** అయినాడ గ్రామంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) పనులను తహసీల్దార్ దాడిశెట్టి శైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించిన ఆమె, బీఎల్‌వోలు చేపడుతున్న విధులు, నమోదు ప్రక్రియ, దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రతి అర్హ ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

తనిఖీ సందర్భంగా సంబంధిత రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని అన్నవరంలో ప్రత్యేక పూజలు....



**శంఖవరం పెన్ పవర్ జులై 12:-** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని కోరుతూ అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మహా ఆయుష్ హోమం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తోలేటి శిరీష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, పర్వత సురేష్, గోవిందరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో కొనసాగాలని స్వామివారిని ప్రార్థించారు.

# 1/70 కోసం గిరిజనం గర్జించింది.. 'మేము సైతం' అంటూ దుచ్చరపాలెం చారిత్రక ప్రతిజ్ఞ

- దుచ్చరపాలెంలో మిన్నంటిన 'మేము సైతం' నినాదం
- ఆదివాసీల భూహక్కుల కోసం ఏకతాటిపై గ్రామం --
- చట్టాల పరిరక్షణే గిరిజన మనుగడకు భరోసా



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 12:** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములు, ఆస్తులు, హక్కులకు రక్షణ కవచంగా నిలిచిన 1/70 భూ బదలాయింపు నిరోధక చట్టాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో దుచ్చరపాలెం గ్రామం శనివారం ఉద్యమ స్ఫూర్తితో మార్మోగింది. ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన "మేము సైతం" కార్యక్రమంలో చిన్నా, పెద్దా, మహిళా, పురుషులనే తేడా లేకుండా గ్రామస్తులందరూ పాల్గొని గిరిజన హక్కుల పరిరక్షణకు తమ అంకితభావాన్ని చాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో గ్రామ పెద్దలు, గిరిజన నాయకులు మాట్లాడుతూ, దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 1/70 చట్టం గిరిజనుల జీవన హక్కులకు, భూముల రక్షణకు మూలస్తంభమని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని బలహీనపరిచే లేదా నిర్వీర్యం చేసే ఎలాంటి ప్రయత్నాన్నైనా గిరిజన సమాజం సహించబోదని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల భూ ఆక్రమణలు, చట్టవిరుద్ధ భూ లావాదేవీలు పెరిగితే ఆదివాసీల జీవనాధారం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల 1/70 చట్టాన్ని యథాతథంగా, కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సభ అనంతరం గ్రామస్తులందరూ చేతులు ఎత్తి, గిరిజన భూములు, హక్కులు, సంప్రదాయాలను కాపాడేందుకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ దృశ్యం అక్కడి ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపగా, గిరిజన ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని "మా భూములు మాకే", "1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి" అంటూ నినాదాలు చేశారు. వారి ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గిరిజన భూముల పరిరక్షణలో అధికారులు మరింత చొరవ చూపాలని, చట్ట ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గిరిజన హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలు కొనసాగితే ఏజెన్సీ వ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లో సెల రామకృష్ణ, ఆల్ ఇండియా ఆదివాసీ స్వయంపాలన సాధనా సమితి ఉపాధ్యక్షుడు మడపల సోమేశ్ కుమార్, గ్రామ పెద్దలు సాగిన రామరాజు పడాల్, మాజీ సర్పంచ్ పుష్పకుమారి, మండల పీసా కమిటీ ప్రతినిధులు, కొర్ర బలరాం, మాదిరి చంటిబాబు, కొర్ర భూపతి, లకే రామచంద్రుడు, సాగిన భీమేష్ పడాల్, గబులంగి గణేష్, కొయ్యం ఇమ్మానుయేల్, తగ్గి సోమరాజు, లక్ష్మణ్ బ్రదర్స్, కృష్ణ పడాల్, బ్రహ్మాజీ, గోపి, గుమ్మల రాంబాబు, మాజీ వార్డు సభ్యులు జోగు పడాల్, రామ్మూర్తితో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "1/70 చట్టం కేవలం ఒక చట్టం కాదు... అది గిరిజనుల అస్తిత్వానికి, భూహక్కులకు, భవిష్యత్తుకు భరోసా" అనే సందేశంతో దుచ్చరపాలెం గ్రామం ఇచ్చిన పిలుపు ఏజెన్సీ ప్రాంతాల్లో స్ఫూర్తిదాయక చర్చకు దారి తీసింది.




## గాజువాకలో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహణ





**గాజువాక : పెన్ పవర్, జూలై 12**
నేషనల్ లోక్ అదాలత్ లో గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు సంబంధించి గాజువాక మూడవ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు లో ఇరు పార్టీలు రాజీ కాగా 17 రోడ్ ఆక్సిడెంట్ కేసులు ,
150 టౌన్ న్యూసెన్స్ కేసుల ను లోక్ అదాలత్ లో న్యాయ మూర్తి డి. గీతారాణి పరిష్కరించారు. విశాఖపట్నం మూడవ స్పెషల్ రెండవ తరగతి జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు లో 107 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో మరియు 205 టౌన్ న్యూసెన్స్ కేసుల ను న్యాయమూర్తి కె. భారతి లోక్ అదాలత్ లో పరిష్కరించారు. ఏసిపి జోన్ 2 భవ్య రెడ్డి కోర్టు లను సందర్శించి లోక్ అదాలత్ కేసు లను పర్యవేక్షించారు .గాజువాక ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషా దేవి.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 12.** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మండల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషా దేవి అన్నారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ?వర్షాల రాకతో వాతావరణంలో మార్పులు సంభవిస్తాయని, ఈ క్రమంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలంతా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తేనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని ఆమె స్పష్టం చేశారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ముందుగా ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ?ముఖ్యంగా కాచి వడగట్టిన నీటినే సేవించాలని, దోమలు వృద్ధి చెందకుండా ఇంటి సమీపంలో, ఖాళీ ప్రదేశాల్లో, గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలనీ, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండల్లో నీరు చేరకుండా తగిన జాగ్రత్తలు వహించడంతో పాటు, ఇళ్ల చుట్టుపక్కల పెరిగే పిచ్చి మొక్కలను, పొదలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని స్పష్టం చేశారు. దోమకాటు నుంచి రక్షణ పొందడానికి నిద్రించే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలను వినియోగించాలన్నారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే చిన్నపాటి అనారోగ్యానికి సైతం అశ్రద్ధ చేయకూడదనీ, ముఖ్యంగా జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే ?స్వయం వైద్యం చేసుకోకుండా, ఏ చిన్న లక్షణం కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన సలహాలు, మందులు వాడాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని ఎంపీపీ అనూషా దేవి కోరారు.

## పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షించిన మంత్రి నారాయణ, పల్లా





**కుర్మాన పాలెం: పెన్ పవర్, జూలై 12:** పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న గాజువాక ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ , జీవీఎంసీ కమిషనర్ కేతన్ , వీఎమ్ఆర్డిఏ కమిషనర్ తేజ్ భరత్ తో పాటు విచ్చేసి గాజువాక జోనల్ కార్యాలయంలో పురపాలక లో ఉన్న అన్ని డిపార్ట్మెంట్ల అధికారులతో గాజువాకలో అభివృద్ధి పనులు నిమిత్తం సమీక్ష చేశారు .ఇందులో భాగంగా 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర 85వ వార్డు అగనంపూడి ప్రాంతానికి సంబంధించిన బొర్రమాంబ ఆలయం దగ్గర గ్రౌండ్ ఫార్మాసిటీ కాలనీ గ్రౌండ్, దానబోయినపాలెం బ్రిడ్జ్, అగనంపూడిలో 60 అడుగుల రోడ్ల వెడల్పులు తో సెంట్రల్ డివైడర్స్ లైటింగ్ ఫుట్ పాత్ లు పలు రోడ్లు, డ్రైనేజీలు ఓపెన్ స్థలాల రక్షణ గోడలు కమ్యూనిటీ హాళ్లు , ఫార్మాసిటీ కాలనీ నిర్వాసితుల ఏ.పి.ఐ.ఐ.సీ కొత్త లేఔట్ లో అభివృద్ధి పనులపై పల్లా శ్రీనివాసరావు ద్వారా తెలియజేసి వివరించడం జరిగింది. దీనిపైన మంత్రి నారాయణ స్పందిస్తూ వీలైనంత త్వరగా అన్ని ఇష్టమేషన్ లు వేసి సాంక్షన్ చేయించమని, సంబంధించిన అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## బాక్సైట్, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలి



సీపీఎం నేత బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్

అసంపల్లిలో సభా స్థలాన్ని పరిశీలించిన ప్రతినిధి బృందం

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 12 :** గిరిజన ప్రాంతాల్లో ప్రతిపాదిత బాక్సైట్ తవ్వకాలు, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా గ్రామపంచాయతీల నుంచి రాష్ట్ర అసెంబ్లీ వరకు ప్రజాప్రతినిధులు తీర్మానాలు ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పర్యటన నేపథ్యంలో ఆదివారం జీకే వీధి మండలం, జెర్రెల పంచాయతీ పరిధిలోని అసంపల్లి బాక్సైట్ కొండ మిట్టల వద్ద ఈ నెల 18న నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని సీపీఎం ప్రతినిధి బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర అసెంబ్లీలో, జెడ్పీటీసీలు జిల్లా పరిషత్‌లో, ఎంపీటీసీలు, ఎంపీపీలు మండల పరిషత్‌లలో బాక్సైట్ తవ్వకాలు, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తీర్మానాలు ఆమోదించాలని కోరారు. అనంతరం గిరిజన ప్రజల వద్దకు వెళ్లి వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గిరిజనుల హక్కులను పరిరక్షించే 1/70 చట్టానికి పొంచి ఉన్న ముప్పును, జీవో నెం. 3 రద్దు కారణంగా గిరిజన నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఉపాధి నష్టాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 1/70 చట్టం కేసులో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఇంప్లీడ్ కావాలి.



సుప్రీంకోర్టులో గిరిజనుల తరపున వాదనలు వినిపించాలి.

విశాఖ చర్చావేదికలో గిరిజన సంఘాల నేతల డిమాండ్.

**చింతపల్లి పెన్ పవర్ జూలై 12.** గిరిజనుల మనుగడకు అత్యంత కీలకమైన 1/70 చట్టాన్ని పరిరక్షించుకునేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నడుంబిగించాలని పలువురు గిరిజన, రాజకీయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని సవాల్ చేస్తూ గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసులో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఇంప్లీడ్ పిటిషన్లు వేసి, గిరిజనుల హక్కులను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో 1/70 చట్టం పరిరక్షణపై ప్రత్యేక చర్చా వేదికను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కంకిపాటి వీరన్నపడాల్, భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కును నిర్వీర్యం చేసేందుకు కొందరు కోర్టులను ఆశ్రయిస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు మిన్నకుండిపోవడం తగదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో జరుగుతున్న ఈ న్యాయపోరాటంలో ప్రభుత్వాలు నేరుగా జోక్యం చేసుకుని (ఇంప్లీడ్ అయి), చట్టం ఆవశ్యకతను సర్వోన్నత న్యాయస్థానానికి బలంగా వినిపించాలని కోరారు. దీనికితోడు గిరిజన ప్రాంతాల్లోని యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు దక్కేలా, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని నాయకులు నొక్కిచెప్పారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం ఉద్దేశించిన గిరిజన సలహా మండలిని మరింత బలోపేతం చేసి, ఆదివాసీల సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 1/70 చట్టం గిరిజనుల అస్తిత్వానికి సంబంధించిన విషయమని, దాని రక్షణ కోసం అందరూ సంఘటితంగా కృషి చేయాలని ఈ వేదికగా నాయకులు పిలుపునిచ్చారు.

## అరకు సి ఐ గా కోటేశ్వరరావు



**అరకులోయ పెన్ పవర్ జూలై 12:** విశాఖపట్నం రేంజి డి ఐ జి ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా ఆదివారం బాధ్యతలను స్వీకరించిన నూతన సి ఐ కోటేశ్వరరావు సి ఐ విశాఖపట్నం రేంజి ఆఫీస్ నుండి బదిలీపై వచ్చారు. అరకు సర్కిల్ సిఐగా పనిచేసిన ఎల్ హిమగిరి ఎస్ కోట రూరల్ సర్కిల్ ఆఫీస్ లో పై బదిలీపై వెళ్లారు
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నూతన సి ఐ ఏ కోటేశ్వరరావు మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు ఎటువంటి భంగం జరగకుండా ఎటువంటి ఆవాంఛనియా సంఘటనలు జరగకుండా చేస్తూ ప్రజల యొక్క సమస్యలను వెంటనే పరిష్కరించలా చూస్తానని అలాగే అరుకు సర్కిల్ పరిధిలో ఎటువంటి ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తానని మరి ముఖ్యంగా గంజాయి నీ పూర్తిగా అరికట్టెల చర్యలు తీసుకుంటానని తెలియజేశారు.

## ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- జూలై 14న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ:ఫ్యాప్టో నాయకుల పిలుపు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 12:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూలై 14న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే రాష్ట్రవ్యాప్త "రైట్ ఫర్ టీచింగ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించడం, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించడం, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయడం, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయడం, పెండింగ్ బకాయిలన్నీ చెల్లించడం, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం వంటి డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే మార్గమని పేర్కొంటూ, జిల్లాలోని ఉపాధ్యాయులందరూ జూలై 14న జరిగే నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాల నేతలు కిట్లలంగి పెద్దబ్బాయి, లోసెల రామకృష్ణ, పి. సతీష్, ఆర్. వెంకటేశ్వర్లు, ముర్ల వెంకటరమణ, మొల్ల దేవుడు, వినోద్ కుమార్, వసంత్, ధారబాబు కాళేశ్వరరావు, ఎం.వి. దొర, బాలరాజు తదితర ఫ్యాప్టో నాయకులు పిలుపునిచ్చారు.

## అన్నవరంలో వైభవంగా శ్రీ సత్యదేవుని రథ సేవ





**అన్నవరం పెన్ పవర్ జూలై 12:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో 'శ్రీ సత్యదేవుని రథ సేవ' అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఈ వేడుకలో భాగంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరితమైన పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథ వాహనంపై ఆశీనులను చేసి, వేద పండితుల మంత్రోచ్చారణలు మరియు మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు.

?ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు, వ్రత పురోహితులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## అన్నవరం సత్యదేవుని అన్నదానానికి రూ. 1,01,116/- భారీ విరాళం




**అన్నవరం,పెన్ పవర్ జూలై 12:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి భారీ విరాళం అందింది. శ్రావణ బహుళ తదియ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేకంగా నిర్వహించ తలపెట్టిన అన్నదాన కార్యక్రమం కోసం హైదరాబాద్‌కు చెందిన. డి. రాధా కళ్యాణి ముందుకొచ్చారు.

స్వామివారిపై ఉన్న భక్తిశ్రద్ధలతో ఆమె అన్నదాన నిమిత్తం రూ. 1,01,116/- (అక్షరాలా ఒక లక్ష వెయ్యి నూట పదహారు రూపాయలు) నగదును నిర్వాహకులకు విరాళంగా బహూకరించారు. భక్తుల ఆకలి తీర్చడం కోసం ఇంతటి భారీ విరాళాన్ని అందజేసిన దాత రాధా కళ్యాణి ఆలయ అధికారులు, నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## 1,50,000 రూపాయల సొంత నిధులతో రోడ్లు మరమ్మత్తులు





**గండేపల్లి, పెన్ పవర్, జూలై 12:**గండేపల్లి మండలం ఉప్పలపాడు లో గ్రామానికి చెందిన జనసేన నాయకులు మేడి బోయిన వీర వెంకట సత్యనారాయణ (శ్రీను) తన సొంత నిధులతో పాడైపోయిన రోడ్లన్నీ మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏ విధమైన అభివృద్ధి చేయక రోడ్లన్నీ వర్షాలకి అధ్వానంగా తయారయ్యాయి అన్నారు.తన సొంత నిధులు సుమారు 1లక్షా 50 వేల రూపాయలతో గ్రామంలో అధ్వానంగా ఉన్న రోడ్లన్నీ మరమ్మతులు చేసి గ్రావెల్ రోడ్ లు వేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో అంకం కృష్ణ,ఆచంటి శ్రీను,గంధం కాపు, కొబ్బిరెడ్డి గణేష్,మేడి బోయిన అబ్బులు,దోసరపూడి రాంబాబు, అడబాల బాబూరావు,సలాది రాంబాబు,ఆండ్రా శ్రీను,కక్కల రాజు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





- ఓటు నమోదు 100% పూర్తి చేయాలి
- రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్ రావు

**గండేపల్లి, పెన్ పవర్, జూలై, 12:**ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అలాగే 100% ఓటు నమోదు అదేవిధంగా కార్యకర్తలు, బి ఎల్ వో లు లకు టిడిపి మండల అధ్యక్షులు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం

గండేపల్లి మండలంలో సర్ ఓటు నమోదు ప్రక్రియ 100% పూర్తయిన బొర్రంపాలెం, కె గోపాలపురం, సింగరంపాలెం గ్రామాల్లో మండల టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలను అభినందించారు.

సర్ ప్రోగ్రాం 100% పూర్తయిన సందర్భంగా బొర్రంపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోతుల మోహనరావు పాల్గొన్నారు. ఆయనతో పాటు బొర్రంపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు యర్రంశెట్టి వెంకటలక్ష్మి బాబ్జి గ్రామ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతరం కె గోపాలపురం గ్రామంలోఅదేవిధంగా కూడా సర్ ఓటర్ నమోదు కార్యక్రమం 100% పూర్తయింది. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, గోపాలపురం గ్రామ పార్టీ అధ్యక్షులు పి. గనిరాజ్, బిఎల్‌ఏలు చంద్ర రావు, నాగేశ్వరావు గ్రామ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతరం సింగరంపాలెం గ్రామంలోఅదేవిధంగా కూడా సర్ ఓటర్ నమోదు కార్యక్రమం 100% పూర్తయింది. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు పాల్గొని సింగరం పాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు అక్కిన నాగేశ్వరరావు, బూత్ ఇన్చార్జి అక్కిన సుదర్శన్ రావు, బిఎల్‌ఏ లను అభినందించారు.

ఈ సందర్భంగా పోతుల మోహనరావు మాట్లాడుతూ, సర్ ఓటు నమోదును రెండు రోజులు మిగిలి ఉండగానే 100% విజయవంతంగా పూర్తి చేసిన బొర్రంపాలెం, కే గోపాలపురం, సింగరంపాలెం గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తల కృషిని అభినందించారు. ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడానికి కృషి చేసిన బూత్ కమిటీలకు, బిఎల్‌ఏలకు ధన్యవాదాలు తెలిపారు.

మిగతా గ్రామాల్లో కూడా నూటికి నూరు శాతం ఓటు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మోహనరావు పిలుపునిచ్చారు.

## సమాజ అభివృద్ధి కి సాయి రామకృష్ణ సేవలు కొనసాగించాలి



- రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ చక్రవర్తి

**గండేపల్లి, పెన్ పవర్, జూలై 12:**ఉపాధ్యాయ వృత్తి లో 42 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్ లో వేలాది మంది విద్యార్థులను తీర్చి దిద్ది పదవీ విరమణ చేసిన తోటకూర సాయిరామకృష్ణ సేవలు అభినందనీయమని రాష్ట్ర సమాచార శాఖ(ఆర్ టి ఐ ) కమిషనర్ వి ఎస్ కె చక్రవర్తి పేర్కొన్నారు ఇటీవల హెచ్ ఎం గా పదవీ విరమణ చేసిన సాయి రామకృష్ణ అభినందన కార్యక్రమానికి రావాల్సి ఉండగా కుదర లేదని పేర్కొంటూ,మాస్టర్,డాక్టర్ లకు మాత్రమే విరమణ అనేది ఉండదని ,సమాజం లో మంచి గుర్తింపు తో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉద్యోగ విరమణ చేసిన సాయి రామకృష్ణ తన సేవలను పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కొనసాగించాలని సూచించారు.ఆయనను దుస్సాలువా తోనూ,నూతన వస్త్రాలు బహూకరించి సత్కరించారు.వారి వెంట వారి బాల్య స్నేహితులు టి వి వి సత్యనారాయణ పాల్గొన్నారు

## మత్స్యగెడ్డ అందాలను వీక్షించిన ఐఏఎస్ దంపతులు




**కుటుంబ సమేతంగా నాటు పడవలో విహారం.**

**ప్రకృతి అందాలను చూసి ముగ్ధులైన కుటుంబం.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 12.** అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, ఐటిడి పిఓ ఆదిత్య వర్మ భార్యాభర్తలిద్దరూ ఆదివారం సుజనకోట పంచాయతీ, సుజనపేట గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డలో నాటు పడవపై కుటుంబ సభ్యులతో ప్రయాణం చేశారు. పచ్చని కొండల మధ్య మత్స్యగెడ్డలో ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో సాయంత్రం వేళ పడవ ప్రయాణం, కనుచూపు మేరలో కనిపించే ప్రకృతి అందాలు వారి మనసుకు ముగ్ధులును చేశాయి. పర్యటక అభివృద్ధి, గిరిజన మత్స్యకారుల జీవన విధానంపై స్థానిక మాజీ సర్పంచ్ వెంగడ రమేష్ ను ఐఏఎస్ అధికారులు అడిగి తెలుసుకున్నారు.

## సీఎం పర్యటన విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు



- ధవలేశ్వరం బ్యారేజ్ గేట్ల మరమ్మతులకు రూ.150 కోట్ల పనులకు శంకుస్థాపన --
- రైతులతో ముఖాముఖికి సీఎం చంద్రబాబు

**రావులపాలెం, పెన్ పవర్ జూలై 12:** ధవలేశ్వరం బ్యారేజ్ సమీపంలోని పిచ్చుక లంకలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రావులపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్ సభా ప్రాంగణం, పార్కింగ్, ప్రజల రాకపోకలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధవలేశ్వరం బ్యారేజ్ గేట్ల మరమ్మతులకు రూ.150 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన ధవలేశ్వరం బ్యారేజ్ ఆధునీకరణకు ఈ పనులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం రైతులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నేరుగా అన్నదాతలతో మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకోనున్నారని తెలిపారు. రైతుల సంక్షేమం, సాగునీటి వ్యవస్థ బలోపేతం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.సీఎం పర్యటన విజయవంతం అయ్యేలా పార్టీ నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, సభకు పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరుకావాలని కొప్పిశెట్టి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుత్తుల పట్టాభిరామయ్య సాధనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## సూర్యోదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం.....






**శంఖవరం పెన్ పవర్ జూలై 12:-** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం లో తొండంగి మండలం ఏ. కొత్తపల్లి గ్రామం లో సూర్యోదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం పాయకరావు పేట లో హైమా నేత్రాలయ వారి సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించగా, ఎక్కువ మందికి ఉచిత కంటి పరీక్షలు, మందులు అందజేసి, అవసరమైన వారికి తక్కువ ధరకే కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మాధన సుబ్బారావు రొంగల అర్జున్, చిట్రాశ్రీను, వినోద్, జి. సత్యనారాయణ, టి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

**ధవళేశ్వరం బ్యారేజ్ ఆధునీకరణతో డెల్టా రైతులకు శాశ్వత ప్రయోజనం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**




**పెన్ పవర్ రావులపాలెం, జూలై 12:**గోదావరి డెల్టా అభివృద్ధి, రైతాంగ సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న కార్యక్రమాలు మైలురాయిగా నిలుస్తాయని, సోమవారం జరిగే సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ఆదివారం రావులపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ధవళేశ్వరం బ్యారేజ్‌కు రూ.150 కోట్లతో 117 గేట్ల ఆధునీకరణ, మరమ్మతు పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ పనులు పూర్తైతే గోదావరి డెల్టాలోని సుమారు 10.50 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరా మరింత మెరుగై రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. వరద నియంత్రణ, కాలువలకు నీటి సరఫరా, సాగునీటి నిర్వహణలో బ్యారేజ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో బ్యారేజ్ నిర్వహణ నిర్లక్ష్యానికి గురైందని విమర్శించిన ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.150 కోట్ల నిధులు మంజూరు చేసి గేట్ల ఆధునీకరణకు శ్రీకారం చుట్టడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.అదే రోజు బొబ్బర్లంక సమీపంలోని పిచ్చుకలంకలో ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖి నిర్వహించి సాగునీరు, వ్యవసాయ మౌలిక వసతులు, వరదల నివారణ, నదీ పరిరక్షణ, కాలువల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. గోదావరి నదికోత నివారణకు గ్రోయిన్లు, సిఫన్లు, ఏటిగట్ల బలోపేతం, రహదారులు, కాలువల ఆధునీకరణ వంటి అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.లొల్ల లాకుల పునర్నిర్మాణానికి రూ.74.20 కోట్ల మంజూరు, పట్టిసీమ--పోలవరం ప్రాజెక్టుల పురోగతి, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగం వంటి చర్యలు రైతాంగానికి మేలు చేస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు రైతులు, ప్రజలు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు.






## హరిత కాకినాడ కోసం ఆల్ ఈజ్ వెల్ నిరంతర సేవలు



**కాకినాడ, జూలై 12 పెన్ పవర్:** కాకినాడ నగరాన్ని పచ్చదనంతో నింపి పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో "ఆల్ ఈజ్ వెల్" స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం హరిత--స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు పల్లంరాజు నగర్‌లోని అక్షర స్కూల్ రోడ్డులో, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కిషోర్ మాట్లాడుతూ, "హరిత కాకినాడ" లక్ష్యంగా సంస్థ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణే తమ ధ్యేయమని పేర్కొంటూ, నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటడం, ఉచితంగా మొక్కలను పంపిణీ చేయడం, నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగే వరకు నీరు పోయడం, ట్రీ గార్డులు ఏర్పాటు చేసి సంరక్షించడం వంటి కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఆల్ ఈజ్ వెల్ సభ్యులు, దంత వైద్యులు డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోందని, దానిని తగ్గించేందుకు ప్రజలు,వ్యాపారుల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నగర పరిశుభ్రత కోసం పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో సభ్యులందరూ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాజ్‌కుమార్, కార్యదర్శి టి.వి.వి.ఎస్.ఎన్. రెడ్డి, డాక్టర్ రవివర్మ, విక్రమ్, రాజేంద్ర, శ్రీనివాసు, వెంకటనారాయణ, సీనియర్ సిటిజన్లు కరి నాగభూషణం, కృష్ణారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు. సుమారు 30 మంది విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులు ఉత్సాహంగా పాల్గొని హరిత--స్వచ్ఛత కార్యక్రమానికి తమ సేవలు అందించారు.

## రైతు బాంధవుడు సీఎం చంద్రబాబు కోనసీమ పర్యటనను విజయవంతం చేయాలి



**ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్**

**రామచంద్రపురం, పెన్ పవర్, జూలై 12:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను చారిత్రాత్మక విజయంగా నిలపాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గోదావరి డెల్టా రైతుల జీవనాధారమైన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టడం రైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. రూ.150 కోట్ల వ్యయంతో 117 గేట్ల ఆధునీకరణ చేపట్టడం ద్వారా డెల్టా ప్రాంత సాగునీటి వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు లక్షలాది రైతు కుటుంబాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.ధవళేశ్వరం నుంచి డెల్టా రైతులకు సాగునీటి భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం ముందుచూపుతో చర్యలు తీసుకుంటోందని, నీటి నిర్వహణ, కాలువల అభివృద్ధి, వరద నియంత్రణ, వ్యవసాయ ఆధునీకరణ వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.పిచ్చుకలంకలో ముఖ్యమంత్రి రైతులతో నిర్వహించనున్న ముఖాముఖి కార్యక్రమం డెల్టా రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపే వేదికగా నిలుస్తుందని, రైతులు తమ సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు మేరకు రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రి పర్యటనను ఘనవిజయవంతం చేయాలని అక్కల రిష్వంత్ రాయ్ కోరారు. రైతు అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని, రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొంటూ, కోనసీమ గడ్డపై రైతు బాంధవుడికి అపూర్వ స్వాగతం పలికి రైతుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు జనసేన మండల అధ్యక్షులు బోండా వెంకన్న, గరికపాటి సూర్యనారాయణ, మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, క్లస్టర్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఇండియా మిషన్ కాకినాడ జిల్లా అధ్యక్షురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మిని సన్మానించిన దళిత నాయకులు

- దళితువాడ ప్రత్యేక పంచాయతీ సాధనకై కృషి చేయండి
- జిల్లా అధ్యక్షురాలు కొంకిపూడి రాజ్యలక్ష్మి పిలుపు




**శంఖవరం/ రౌతులపూడి పెన్ పవర్ జూలై 12:-** మహిళలకు రక్షణగా తన వంతు సహాయ సహకారాలు అందించిన కొంకిపూడి రాజ్యలక్ష్మి అంబేద్కర్ ఇండియా మిషన్ కాకినాడ జిల్లా అధ్యక్షురాలుగా ఎంపికయ్యారు. ఆమె నియామకం పట్ల జిల్లాలో గల రౌతులపూడి దళిత ఉద్యమ నాయకులు, బలరాంపురం జై భీమ్ యూత్ సభ్యులు, మహిళలు అనేక ప్రజా సంఘాల హర్షం వ్యక్తం చేసి పూలదండ్రులతో ఘనంగా సన్మానించారు. ఏఐఎం అధినేత పివి సునీల్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు బలరామపురం గ్రామానికి చెందిన కుంకిపూడి రాజ్యలక్ష్మి జిల్లా ఏఐఎం మహిళా అధ్యక్షురాలుగా నియమించినట్లు వర్కింగ్
ప్రెసిడెంట్ కొంకి హరికృష్ణ అధికారకంగా ప్రకటించిన విషయం తెలిసిందే.
కొంకిపూడి రాజ్యలక్ష్మి ప్రజా ఉద్యమాలలో చురుకుగా ఉత్సాహంతో మహిళల సమస్యల పట్ల ముందుంటారని దళిత ఉద్యమ నాయకులు ముఖే నాని, గంటా భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ఏఐయం అధినేత పివి సునీల్ కుమార్ ఐపీఎస్ మరియు ఏఐయం పెద్దలకు ఆమె ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. మహిళా శక్తిని సంఘటితం చేస్తూ మహిళా
ఆశయాలను గ్రామస్థాయి నుండి రాష్ట్ర జాతీయస్థాయి వరకు బలోపేతం చేయడమే నా లక్ష్యమని ఆమె అన్నారు.
జిల్లాలో మహిళా విభాగం మరింత క్రియాశీలశీగా మారుతుందన్నారు. సమాజంలో మార్పు కోసం మనవాడ- మన పంచాయతీ-మన పాలన లక్ష్యసాధనను,ఏఐఎం సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బలరాంపురం జై భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## -ప్రత్తిపాడు ఎస్ఐ, ఎస్ లక్ష్మీకాంతం హెచ్చరిక.

**-ధర్మవరం గ్రామ శివారున పేకాట శిబిరంపై దాడి 8 మంది వ్యక్తులు అరెస్ట్, 9700 నగదు స్వాధీనం.**



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూలై,12:** మండలంలో ఎవరైనా జూద కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రతిపాడు ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతం హెచ్చరించారు.ప్రత్తిపాడు మండల ధర్మవరం గ్రామ శివారున పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించి 8 మందిని అరెస్టు చేయడమే కాకుండా, వారి వద్ద నుండి 9700/-నగదును ఎస్సై, ఎస్ లక్ష్మి కాంతం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ ఐ, ఎస్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు,పెద్దాపురం డిఎస్పీ ఏబిజీ తిలక్ సూచనలతో ప్రత్తిపాడు సీఐ బి సూర్య అప్పారావు పర్యవేక్షణలో ధర్మవరం గ్రామ శివారున పేకాట ఆడుతున్నారని తమకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ 9700/- రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.
ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట,బొమ్మ బోకు, గుండాట, కోడిపందాలు వంటి,జూద కార్యకలాపాలకు,అసాంఘిక కార్య కలాపాలకు ఎవరు పాల్పడిన, ఉపేక్షించేది లేదని వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్సై లక్ష్మీకాంతం హెచ్చరించారు.

## ఐదు బుధవారాల జగన్మోహిని కేశవస్వామి సన్నిధిలో భక్తుల సందడి...






**నిత్యా అన్నదానానికి భక్తులు విరాళాలు**

**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 12ద:**ఐదు బుధవారాల ఆధ్యాత్మిక విశిష్టతతో ప్రసిద్ధి చెందిన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం బుధవారం భక్తజన సందోహంతో కళకళలాడింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోగా, గోవింద నామస్మరణలతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి విశిష్ట అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలను వేద మంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, ఆలయ అధికారులు సక్రమ ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.
స్వామివారి సన్నిధానంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు విశేషంగా స్పందిస్తూ తమ వంతు విరాళాలను అందజేశారు. అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన కె. వీర్రాఘవరెడ్డి--లక్ష్మి మాధవి దంపతులు రూ.10,116లను అన్నదాన పథకానికి విరాళంగా సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. దంపతులను ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అసిస్టెంట్ అధికారి ఎం. శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించి ఘనంగా సత్కరించారు.

# డబ్బు గుంజేందుకే నా పరువు తీశారు: పంజాబ్ కింగ్స్ ప్లేయర్

## తప్పుడు ఎఫ్ఐఆర్‌తో తనను బ్లాక్‌మెయిల్ చేశారన్న శశాంక్ సింగ్

## డబ్బు గుంజడానికే పరువు తీసే కుట్ర జరిగిందని ఆరోపణ

## పనిలో పెట్టుకున్న వ్యక్తికి 9 కేసుల నేర చరిత్ర ఉందని వెల్లడి

## మా వాదన వినకుండానే కేసు నమోదు చేశారంటూ ఆవేదన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్ తనపై, తన కుటుంబంపై ఇటీవల నమోదైన కేసుపై తాజాగా స్పందించాడు. సెలబ్రిటీగా తనకున్న పేరును దెబ్బతీసి, డబ్బు గుంజేందుకే ఓ వ్యక్తి తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని సంచలన ఆరోపణలు చేశాడు. తనపై దాడి జరిగిందంటూ ఓ వంట మనిషి పెట్టిన కేసు పూర్తిగా కట్టుకథ అని, ఇది పరువు తీసి డబ్బు రాబట్టేందుకు పన్నిన కుట్ర అని సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్ ద్వారా వివరించాడు. గత నెలలో భోపాల్‌లోని తమ నివాసంలో పనిచేసే వంట మనిషిపై దాడి చేసి, ఫోన్ లాక్కున్నారని శశాంక్ సింగ్, ఆయన తండ్రి, రిటైర్డ్ స్పెషల్ డీజీపీ శైలేష్ సింగ్‌పై రతిబాద్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను శశాంక్ పూర్తిగా ఖండించాడు. "నిజానిజాలు తెలుసుకోకుండా వేలమంది నన్ను దూషించారు. ఒక నిరుపేదను కొట్టిన వ్యక్తిగా నన్ను చిత్రీకరించారు. ఈ ఘటన నన్ను మార్చేసింది, జీవితాంతం గుర్తుంచుకునే పాఠాలు నేర్పింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు. తమ వద్ద పనికి చేరిన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండేదని, ఇంట్లో తిరుగుతూ ఫొటోలు తీసి ఇతరులకు పంపేవాడని శశాంక్ తెలిపాడు. దీంతో మూడో రోజే అతడిని పనిలో నుంచి పంపించేశామని, అప్పుడు అతను ఆరోగ్యంగానే వెళ్లాడని స్పష్టం చేశాడు. "ఆ తర్వాత అతడు తీవ్రంగా గాయపడినట్లు వీడియోలో చూసి మేం షాక్ అయ్యాం. పోలీసు రికార్డుల ప్రకారం అతనిపై అప్పటికే హత్యాయత్నం, గృహ చౌర్యం, దాడి, బెదిరింపులు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసులు సహా మొత్తం 9 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయి. తన గుర్తింపును దాచుకోవడానికి మూడు వేర్వేరు పేర్లు వాడుతున్నాడు" అని శశాంక్ వెల్లడించాడు. ఒక తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా తనపై ఒత్తిడి తెచ్చి, డబ్బు రాబట్టుకోవాలన్నదే అతని ప్రణాళిక అని తాను నమ్ముతున్నానని శశాంక్ పేర్కొన్నాడు. "సాధారణ బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికే ఇబ్బంది పడుతుంటే, మా వైపు వాదన వినకుండానే ఇంత వేగంగా కేసు ఎలా నమోదు చేశారని ఆశ్చర్యపోయాను" అని అన్నాడు. ఏప్రిల్ 30న కూడా తాను ఇలాంటి పనే చేశానని వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. ఆ రోజు తాను ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్నానని, కనీస నిజ నిర్ధారణ లేకుండా వార్తలు రాసి పరువు తీస్తున్నారని విమర్శించాడు. ఈ అనుభవంతో కొన్ని కఠినమైన పాఠాలు నేర్చుకున్నానని చెబుతూ, ప్రజలకు శశాంక్ ఒక ముఖ్యమైన సూచన చేశాడు. "ఇంట్లో పనిచేసే వారిని నియమించుకునే ముందు రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా, పూర్తి పోలీసు వెరిఫికేషన్ తర్వాతే తీసుకోవాలి. జాలి అనేది ఇంగితజ్ఞానాన్ని భర్తీ చేయకూడదు. సత్యానికి సమయం పట్టినా, చివరికి అదే గెలుస్తుంది" అని చెప్పుకొచ్చాడు.

# భారత జట్టులో భారీ మార్పులు.. గంభీర్ నమ్మిన బంటులపై వరుసగా వేటు?





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టు ఓటముల పరంపర కొనసాగుతున్న వేళ తెరవెనుక మరో పెద్ద సంక్షోభం స్టార్ట్ అయింది. ఐర్లాండ్ చేతిలో 2--0తో, ఇంగ్లాండ్ చేతిలో 4--0 తేడాతో టీ20 సిరీస్‌లను ఘోరంగా ఓడిపోవడంతో.. ఇండియా కోచింగ్ స్టాఫ్‌లో అనిశ్చితి నెలకొంది. జట్టు ప్రదర్శనపై బీసీసీఐ త్వరలోనే రివ్యూ మీటింగ్ నిర్వహించనుండగా, ఆలోపే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బిగ్ షాక్ తగిలింది. గంభీర్ కి ఎంతో నమ్మకంగా జట్టులోకి తీసుకున్న సపోర్ట్ స్టాఫ్?లోని ఇద్దరు తప్పుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుత ఇంగ్లాండ్ టూర్ ముగిసిన వెంటనే అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్కాట్, ఫాస్ట్ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ భారత్‌ను వీడబోతున్నట్లు తెలుస్తుంది.

**భారత్‌ని వీడి ఐపీఎల్‌లోకి:**

గత 2024లో గౌతమ్ గంభీర్ భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు, ఈ ఇద్దరు కోచ్‌లు జట్టులో జాయిన్ అయ్యారు. ఇండియన్ బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలను బలోపేతం చేయడం కోసం గంభీర్ స్వయంగా వీరిద్దరిని తుది జట్టులోకి తీసుకున్నాడు. కానీ, ర్యాన్ టెన్ డోస్కాట్ టీమిండియాతో కొనసాగడానికి అంతగా ఇంట్రెస్ట్ చూపించలేదు.. ఏడాది పాటు జట్టుతో కలిసి ప్రయాణించిన తనకు ఇబ్బందిగా మారిందని ఆయన బీసీసీఐకి తెలిపినట్లు టాక్. దీనికి తోడు ఆయన ఒక ప్రముఖ ఐపీఎల్ ఫ్రాంచైజీతో కోచింగ్ పదవి కోసం చర్చలు జరుపుతున్నట్లు వార్త కథనాలు నడుస్తున్నాయి. మరోవైపు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా వన్డే సిరీస్ ముగిసిన తర్వాత తన భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

**జింబాబ్వే టూర్‌కు గంభీర్ ఔట్:**

ఇంగ్లండ్ టూర్ ముగిసిన వెంటనే ఇండియన్ టీమ్ జూలై 2026 చివరి వారంలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడ జింబాబ్వేతో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. జూలై 23న మొదటి టీ20, జూలై 25న రెండో మ్యాచ్, జూలై 26న మూడో మ్యాచ్ జరగనున్నాయి. కానీ, ఈ జింబాబ్వే పర్యటనకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ని బీసీసీఐ తప్పించింది. అతడికి రెస్ట్ ఇవ్వాలని బోర్డు భావిస్తోంది. గంభీర్ స్థానంలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టూర్ కి తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.

**శ్రీలంక టూర్ కి కొత్త బౌలింగ్ కోచ్:**

ఒకవేళ మోర్నీ మోర్కెల్, ర్యాన్ టెన్ డోస్కాట్ ఇద్దరూ జట్టు నుంచి తప్పుకోవాలని ఫిక్స్ అయితే, బీసీసీఐ చాలా వేగంగా స్పందించాల్సి ఉంది. ఎందుకంటే ఆ వెంటనే శ్రీలంక పర్యటనకు టీమిండియా వెళ్లబోతుంది. ఆగస్టు 2026లో జరగబోయే ఈ శ్రీలంక టూర్ లో ఇండియా రెండు టెస్టుల సిరీస్ ఆడబోతుంది. ఆగస్టు 15వ తేదీన గాలే వేదికగా మొదటి టెస్ట్, ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబో వేదికగా రెండో టెస్ట్ జరగనున్నాయి. మోర్కెల్ లేకపోతే, ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న టీమిండియా మాజీ పేసర్ లక్ష్మీపతి బాలాజీని శ్రీలంక టూర్‌కు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా పంపడానికి బీసీసీఐ యోచిస్తుంది.

**ఫీల్డింగ్ కోచ్ టీ.దిలీప్‌పైనా వేటు?**

భారత్ వరుస పరాజయాలతో కేవలం అసిస్టెంట్, బౌలింగ్ కోచ్‌లు మాత్రమే కాదు, ఫీల్డింగ్ కోచ్ దిలీప్ పోస్టుపై కూడా కత్తి వేలాడుతుంది. గత కొంతకాలంగా ఇండియన్ టీమ్ ఫీల్డింగ్ ప్రమాణాలు భారీగా పడిపోవడంతో.. బోర్డు ఆయనపై కూడా అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద గంభీర్ కోచింగ్ టీమ్‌లోని సభ్యులు తప్పుకోవడానికి రెడీ కావడం, మరికొందరిపై బీసీసీఐ వేటు వేసేందుకు సిద్ధమైంది. రాబోయే రోజుల్లో టీమిండియా సపోర్ట్ స్టాఫ్ పూర్తిగా మారిపోయే ఛాన్స్ కనిపిస్తున్నాయి.

# 230 కోట్ల ఆస్తిపరుడైనా సాధారణ జీవితం!



నాభా నటేష్ 'గోల్డెన్ అవర్' గ్లామర్ - కెరీర్, అరంగేట్రం రాబోయే చిత్రాలు



కోలీవుడ్ అత్యంత ప్రతిభావంతులైన నటులలో ధనుష్ ఒకరు. నటుడిగా, గాయకుడిగా, గీత రచయితగా, దర్శకుడిగా , నిర్మాతగా పరిశ్రమలో తనదైన ముద్ర వేసారు. కెరీర్ ఆరంభం నుండి గ్లోబల్ స్టార్ స్థాయి వరకు ఆయన ఎదిగిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకం. అంతేనా 230 కోట్ల రూపాయల ఆస్తిపరుడు. విలాసవంతమైన జీవనశైలి తో పాటు అత్యంత సంపన్న నటులలో ఒకరిగానూ నిలుస్తున్నారు. ధనుష్ ఆస్తుల విషయానికి వస్తే ఆయనకు చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన పోయెస్ గార్డెన్‌లో 150 కోట్ల రూపాయల విలువైన బంగ్లా ప్రధానాకర్షణగా నిలుస్తుంది. అత్యంత భద్రత .. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ భవనం నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఒకటి. అంతే కాదు అళ్వార్‌పేట ప్రాంతంలో 18 కోట్ల రూపాయల విలువైన మరొక లగ్జరీ బంగ్లా కూడా ఉంది. రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు ఆయన ఆర్థిక భవిష్యత్తుపై ఉన్న దూరదృష్టిని తెలియజేస్తున్నాయి. వాహనాల విషయానికి వస్తే ధనుష్‌కు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. సేకరణలో రోల్స్ రాయిస్ ఘోస్ట్, రోల్స్ రాయిస్ స్పెక్టర్ , బెంట్లీ కాంటినెంటల్ జిటి , ఫోర్డ్ ముస్టాంగ్ వంటి అత్యంత ఖరీదైన వేగవంతమైన వాహనాలున్నాయి. 7.5 కోట్ల రూపాయల విలువైన రోల్స్ రాయిస్ స్పెక్టర్ ఎలక్ట్రిక్ సెడాన్‌ను ఇటీవల కొనుగోలు చేసారు. ఆధునిక సాంకేతికత .. విలాసం పట్ల ఆసక్తిని చాటి చెబుతోంది. ధనుష్ ఒక్కో చిత్రానికి 20 నుంచి 35 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటారు. బ్రాండ్ ఎండార్స్‌మెంట్ల ద్వారా కూడా భారీగా ఆర్జిస్తున్నారు. ప్రతి నెలా సుమారు 3 కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని పొందుతుంటారని అంచనా. అంతర్జాతీయ చిత్రాల్లో నటించడం, సొంత నిర్మాణ సంస్థ వుండర్‌బార్ ఫిలిమ్స్ ద్వారా చిత్రాలను నిర్మించడం వంటివి ధనుష్ ఆర్థిక మూలాలను మరింత బలోపేతం చేస్తున్నాయి. అంతటి సంపద, విలాసాలు ఉన్నా? ధనుష్ వ్యక్తిగతంగా చాలా సాధారణంగా ఉంటుంది. బయటకు వెళ్లాలంటే పలానా బ్రాండ్ కారు ఉండాలని లేదు. ఆ సమయానికి ఏది అందుబాటులో ఉంటే అందులో వెళ్లిపోతారు. షూటింగ్ సమయంలో ఎలాంటి పరిస్థితులున్నా? సర్దుకుపోవడం ధనుష్ ప్రత్యేకతగా చెబుతున్నారు. అలాగే పనిపై చూపే నిబద్ధత ..క్రమశిక్షణే ధనుష్ ని ఈ స్థాయికి చేర్చాయి. దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్నా? ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటారు. ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా తనను తాను మలచుకోవడం ధనుష్ ప్రత్యేకత. ఆస్తులు ఎంతటివైనా? తన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల మనసుల్లో ఆయన సంపాదించుకున్న గుర్తింపు అన్నిటికంటే మిన్న. ఆర్థికంగా ఎంత ఎదిగినా? కళాత్మక విలువలను వదులుకోకుండా, నటుడిగా , దర్శకుడిగా కొత్త శిఖరాలను అధిరోహించడం ధనుష్ గొప్పతనం.



స్టైలిష్ ఫోటోషూట్ లుక్‌లో ఐశ్వర్య రాజేష్ ఆకర్షణీయమైన రూపం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com